ఆస్పత్రి మురుగునీరు వెళ్లేదెలా?

- డ్రెయినేజీ అవుట్ లింక్‌కు కలపని మున్సిపల్ సిబ్బంది
- ఆస్పత్రి ఆవరణలోని గుంతలోకి మురుగు
- దుర్వాసనతో రోగులకు ఇబ్బందులు
- 'నేను నా మిర్యాలగూడ'తో సమస్య పరిష్కారయ్యేనా!


మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో డ్రెయినేజీ సమస్య నెలకొంది. వంద పడకల ఆస్పత్రి అయినా.. స్థాయికి మించి రోగులు వస్తుండడంతో వచ్చే రోగులు డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి టాయిలెట్స్ నుంచి వస్తున్న నీరు నేరుగా బయట ఉన్న డ్రెయినేజీ అవుట్ లింక్‌లోకి కలపాల్సి ఉన్నా.. మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలపడం లేదు. దీంతో డ్రెయినేజీ నీరంతా ఆసత్రి సిబ్బంది..ఆవరణలోనే గుంత తీసి అందులోకి వదులుతున్నారు. డ్రైనేజీ నీరు ఆ గుంతలో ఎక్కువ రోజులు ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

కాలనీ వాసులు వ్యతిరేకిస్తున్నారని..

కాగా ఆస్పత్రి నుంచి వచ్చే మురుగు నీరు బయటి డ్రెయినేజీ కాల్వలకు లింక్ కలిపేందుకు అప్పట్లో ఆస్పత్రి వెనుక ఉన్న కాలనీవాసులు వ్యతిరేకిస్తున్నారని మున్సిపల్ అధికారులు సాకులు చూపతున్నారని సమాచారం. ఆస్పత్రి ఏర్పాటు చేసిన సమయంలో అక్కడ ఎలాంటి ఇళ్లు లేవని, ఇప్పుడు వారు అడ్డు చెప్పడం ఏంటని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి సైతం ఈ సమస్యను పదేళ్లుగా తీసుకెళ్లినా వారికేమి పట్టనట్లు వ్యవహరించారని ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే వినూత్న కార్యక్రమం

మిర్యాలగూడను పారిశుద్ధ్యంలో 119 నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇస్తున్న ఎమ్మెల్యే ఏరియా ఆస్పత్రి నుంచే పారిశుద్ధ్య పనులను మెరుగుపరిచే దిశగా భారీ కార్యక్రమం ఏర్పాటు చేశాడు. దీంతో పదేళ్లుగా ఆస్పత్రిలో ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు ఎమ్మెల్యే దారి చూపిస్తారని ఆస్పత్రి వైద్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కార్యక్రమం ప్రారంభించన చోటే మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్యకు చెక్ పెడుతానని వైద్యులకు హామీ కూడా ఇచ్చినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఏరియా ఆసత్రికి వచ్చే ప్రతీ రోగికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారించి, రోగుల ఇబ్బందులను తొలగించేందుకు డయాలసిస్ మిషన్లను ఏర్పాటు చేస్తామని హామీ కూడా ఇచ్చారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వైద్యులను ఆదేశాలు ఇచ్చారు. అలాగే నేను నా మిర్యాలగూడ కార్యక్రమాన్ని ఆస్పత్రి నుంచే ప్రారంభించారు. దీంతోనైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వైద్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దుర్వాసన వస్తుంది



ఏరియా ఆస్పత్రిలోని మురుగు నీరు బయట ఉన్న డ్రెయినేజీలోకి లింక్ కలపకుండా మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. డ్రెయినేజీ నీరు ఆస్పత్రి ఆవరణలోనే నిలిచి ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. గతంలో మురుగు నీటిని బయటి డ్రెయినేజీకి కలిపేందుకు ప్రయత్నం చేశాం. కాలనీవాసులు మాపై దాడికి ప్రయత్నించారు. ఈ విషయంపై మున్సిపల్ ఉన్నతాధికారులకు కూడా విన్నవించాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వివరించా, సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. మురుగు నీటికి దారి చూపిస్తే దుర్వాసనతో ఇబ్బంది ఉండదు.

– శ్రీనివాస సమరథ్, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు


వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు

దేవరకొండ : లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర దేవరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు శివపార్వతి మాట్లాడుతూ ఇప్పటికే లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అలివేలు మంగ, మధుబాల, పగిడిమర్రి శ్రీనయ్య,పున్న శైలజ, సుభాషిని, చంద్రకళ, యాదమ్మ, తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల నరేష్, పిట్టల ప్రవీణ్, పజ్జూరు లింగస్వామి అనే వ్యక్తులు గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా దాడి చేసి పట్టుకోని ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు నరేష్, ప్రవీణ్, లింగస్వామిలతోపాటు వారి ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ బోల్తా


కుర్మేడు సమీపంలో బోల్తా పడిన లారీ

చింతపల్లి : రాష్ట్ర రహదారిపై కుర్మేడు గ్రామ సమీపంలో జగ్గయ్యపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిమెంట్ రేకుల లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జగ్గయ్యపేట నుంచి సిమెంట్ రేకులతో వస్తున్న లారీ కుర్మేడు సమీపంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో లారీ డ్రైవర్ అప్రమత్తమై మూలమలుపు వద్ద తప్పించడంతో ఒక్కసారిగా లారీ బోల్తా కొట్టింది. దీంతో లారీలో ఉన్న సిమెంట్ రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ ఘటనలో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన చెస్ టోర్నమెంట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని కేంద్రియ విద్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన రీజనల్ చెస్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. అండర్ 14,17,19 స్థాయిలో బాల బాలికలకు ఈ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు, జిల్లా చెస్ అసోసియేషన్ చీఫ్ ఆర్బిరేటర్ కె.కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఆర్బిరేటర్ ఎమ్.విశ్వ ప్రసాద్, వి.రవీందర్, ఎమ్.నాగరాజుయాదవ్, శ్రీదేవి, జానకి, ఏ.రవికుమార్, ఉక్తాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న శివకుమార్

నల్లగొండ: జిల్లాలో ఇంటర్ కళాశాలల ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ శుక్రవారం డీఐఈఓ దస్రూనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. దరఖాస్తుల పేరిట ఇంటర్ ప్రైవేటు కాలేజీలు రూ.1500 వసూలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో అల్లంపల్లి కొండన్న, కమల నరేష్, కిశోర్, సురేందర్, ప్రవీణ్, శ్రీనులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


మిర్యాలగూడ : మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవ కోటి మనుగడకు మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని, చెట్ల వల్లనే వర్షాలు కురుస్తాయని, స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా రెండు మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల వేణు గోపాల్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి


కల్యాణి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

వేములపల్లి (మాడుగులపల్లి) : ఇద్దరు ప్రేమోన్మాదుల వేధింపులకు బలైన కొత్త కల్యాణి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామ పరిధిలోని చింతలగూడెంలో మృతురాలు కల్యాణి కుటుంబాన్ని ఆమె పరామర్శించి మాట్లాడారు. మహిళల రక్షణకు అనేక చట్టాలను రూపొందించిన వాటిని అమలు పరచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కల్యాణి మృతికి కారణమైన శివ, మధులను ప్రభుత్వం కఠినంగా శిక్షించడంతోపాటు కల్యాణి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తోపాటు రూ.10లక్ష ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని, సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకులు తుమ్మల పద్మ, తంగెళ్ల నాగమణి, గారె పద్మమ్మ, పుల్లెంల శ్రీకర్, పెంటమల్ల సుకన్య, కౌసల్య, కోడిరెక్క వెంకన్న, వడ్డెగాని సైదులు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి


కొండమల్లేపల్లి : వన మహోత్సవ ప్రాధాన్యం తెలియజేస్తూ కళా ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


నాగార్జున సాగర్ : మొక్కనాటి నీళ్లు పోస్తున్న మున్సిపల్ కమిషనర్

అడవిదేవులపల్లి : ప్రతి ఒక్కరూ మొక్కను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. శుక్రవారం గ్రామంలో మొక్కలను నాటడంతో పాటు మండలంలోని వివిధ పనులను ఎంపీడీఓ కరుణాకర్‌రావు పరిశీలించారు. అదే విధంగా అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం గ్రామాల్లో గల కమ్యూనిటీహాల్, ముదిమాణిక్యంలోని అవన్య ప్లాంటెషన్, హోం సైడ్ ప్లాంటి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. వారి వెంట ఎంపీఓ మోసిన్ అహ్మద్, ఏపీఓ సూర్యానాయక్, సీనియ్ అసిస్టెంట్ అమీర్ అలీ, జానకి, రాధ తదితరులున్నారు.

వనమహోత్సవం

నాగార్జునసాగర్ : నందికొండ పైలాన్‌కాలనీలోని 8వ వార్డులో రామాలయం వద్ద శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి ఎదుట మొక్కలు నాటి సంరక్షించాలని పురప్రజలను కోరారు.ఇంట్లో ఎంతమంది ఉంటే అన్ని మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు నాటే ఆవశ్యకతను వివరించారు. మొక్కలపై మానవ మనుగడ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం వన మహోత్సవ ప్రాధాన్యతను తెలియజేస్తూ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఫర్హీన్‌సుల్తానా, ఉపాధ్యాయులు బాలయ్య, సుష్మా, శ్రీలత, సంధ్య, సువర్ణ, ఉమా, శైలజ, నాగమణి, నికిత, నిరీక్షణ, కల్యాణి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు సీడీఎంఏ అవకాశం

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది బదిలీలకు సీడీపీఎం అవకాశం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో బదిలీల అంశంతో పాటు పారిశుద్ధ్య వ్యవస్థపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ఓ కళ్యాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్ఐలు రాకేష్, రవికుమార్ లతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

నేడు చిత్రియాలలో వైద్యశిబిరం

చందంపేట : మండలంలోని చిత్రియాల జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో జాల వెంకట్‌రెడ్డి, అండాలమ్మ జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారి కుమారులు పీసీసీ మెంబర్, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డిలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు బదిలీలు సహజం


టీచర్లను సన్మానిస్తున్న హెచ్ఎం

మిర్యాలగూడ : ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని వీర్లపాలెం ప్రాథ మిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల పంతులునాయక్‌లు అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలం వీర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న నసీమున్నీసాబేగం, హరితలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, రాంప్రసాద్, జానయ్య, ఎస్ఎంసీ చైర్మన్ సిపాయినాయక్, సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు


బేకరి షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ

హాలియా : కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ హెచ్చరించారు. శుక్రవారం హాలియా పట్టణంలో పలు బేకరి షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బేకరి షాపుల పరిశుభ్రతను నిల్వ ఉన్న వస్తువులను ఆయన పరిశీలించారు. అనంతరం కమిషనర్ మున్వర్ అలీ మాట్లాడుతూ బేకరి షాపుల్లో పాడైపోయిన కుల్లిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయించొద్దని, తినేటి, తాగేటి పానియాల గడువు తేదీ ముగిసినా వాటిని ప్రజలకు విక్రయిస్తే బేకరి షాపుల యజమానులకు జరిమానా విధించడంతో పాటు షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, బిల్ కలెక్టర్లు ఉమర్, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


మిర్యాలగూడ : మురుగు కాల్వలో చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మిర్యాలగూడ టౌన్: 5వ వార్డులో మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న కౌన్సిలర్లు

మిర్యాలగూడ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వ్యాధులు దరి చేరవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడంతోపాటు తానే స్వయంగా మురుగు కాల్వలో పేరుకపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాదులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యర్థాలను ఆరు బయట పడవేయకుండా ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాల్లో వేయాలన్నారు. మురుగు కాల్వలను మున్సిపల్ కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపు మేరకు శుక్రవారం 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈదులగూడెం 5వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బండి యాదగిరిరెడ్డి, మంత్రాల రుణాల్‌రెడ్డి, రవినాయక్, చల్లా నాగమ్మవెంకన్నలు స్వయంగా మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఆశోక్ నగర్ వార్డు ఇన్‌చార్జ్ సంతోష్‌నగర్ గోదాల జానకీరాంరెడ్డి ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్వయంగా మురుగు కాలువల శుభ్రంను దగ్గర ఉండి తీయించారు. ఈ పారిశుద్ధ్య పనులను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూలక వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగాల నిరంజన్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డిలు పర్యవేక్షించారు. అలాగే 23 వార్డులో పట్టణంలోని 23వ వార్డులో అశోక్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మహమ్మద్ ఆరీఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి మురుగు కాలువలతో పాటు రోడ్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ సూపర్ వైజర్ పావని, జవాన్లు, బిక్షం, సైదులు, రవి, ఇన్‌చార్జీలు పాతూరి శరత్, అంబటి వెంకటకృష్ణా, గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి, ఉపేందర్, మట్టయ్య, అరుణ్, కృపాకర్ రెడ్డి, అచ్చిరెడ్డిలతో పాటు మున్సిపల్ సిబ్బంది, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సలీమ్, గోవర్ధనాచారి, బుడిద సైదులు, ఉబ్బపల్లి కాశయ్య, మోహమ్మద్ రఫీ, మొజ్, రోమన్ తదితరులు పాల్గొన్నారు.

దామచర్ల రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ : దామరచర్ల రైల్వేస్టేషన్ పునరుద్ధరణకు కృషి చేయాలని మిర్యాలగూడ బీజేపీ నాయకులు శుక్రవారం కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. దామరచర్ల దినదినాభివృద్ధి చెందుతున్నందున కేంద్రం స్పందించి ప్రజల అవసరాల రీత్యా రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మిర్యాలగూడ అసెంబ్లీ ప్రబారి బొగిరెడ్డి లచ్చిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సాధినేని శ్రీనివాస్‌రావు, నాయకులు బాల లక్ష్మీసత్యనారాయణ, ఈగ సైదారావు, సైదిరెడ్డి, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మంజుల

గుర్రంపోడు : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ మంజుల కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రదానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు రెండు రోజుల్లో పూర్తి చేయించాలన్నారు. మండల విద్యాధికారి తరి రాము మాట్లాడుతూ శని, ఆదివారాలు సెలవు రోజులు ఐనప్పటికీ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలకు హాజరై పనులు పూర్తి చేయించాలన్నారు. హెచ్ఎంలు ప్రత్యేక చొరవతో పనులు చేయించిన చోట్ల నూరుశాతం పనులు జరిగాయన్నారు. వీఓలు, హెచ్ఎంలు సమన్వయంలో పనులు పూర్తి చేసి తమ పాఠశాలలకు మౌలిక వసతులు సమకూర్చి అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నోముల యాదగిరి, ఎఈ రవికుమార్, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


అధికారులతో మాట్లాడుతున్న లింగారెడ్డి

పెద్దవూర : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రంగప్పకాలనీలో నెలకొన్న మంచినీటి సమస్య, డ్రెయినేజీలు, సీసీ రోడ్లకు సంబంధించి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా జానారెడ్డి హయాంలోనే జరిగిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా శూన్యమన్నారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించమే లక్ష్యంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, ఊరె వెంకన్న, పద్మారెడ్డి, లక్ష్మయ్య, వెంకటయ్య, వెంకన్న, మల్లిఖార్జున్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వృథాగా కృష్ణా జలాలు


లీకవుతున్న కృష్ణా జలాలు

చింతపల్లి : మండల కేంద్రం నుండి హోమంతాలపల్లి, అనాజీపురం, ఇద్దంపల్లి, మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాలకు వెళ్లే కృష్ణా జలాల పైప్‌లైన్ రెండు రోజుల నుంచి భారీ స్థాయిలో కృష్ణా జలాలు లీకవుతుండడంతో కృష్ణా జలాలతో హోమంతాలపల్లికి వెళ్లే రహదారితో పాటు చింతపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా జలమయమైంది. అధికారులు స్పందించి వెంటనేమరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడొద్దు


మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ: విద్యార్థులు వ్యసనాల బారిన పడొద్దని వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వాడకాలు తగ్గించాలని విద్యార్థులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చిలువేరు యాదయ్య, యాస శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం త్రిమూర్తి, కుక్కపల్లి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


ప్రీతమ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుర్రంపోడు : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరిగరి ప్రీతమ్‌ను కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడి వెంకన్న, శివార్ల శేఖర్, అందుగుల యాదయ్య, చెన్నకేశవులు తదితరులు భారీ సంఖ్యలో ఎస్సీ సెల్ కార్యకర్తలు తరలివెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న రైల్వే పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి అక్రమంగా మద్యం తరలిస్తుండగా రైల్వే పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సమయంలో ప్లాట్‌ఫాం -1 లో అనుమానాస్పదంగా కనిపించిన రెండు బ్యాగులు పరిశీలించగా అందులో మద్యం ఉన్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.13వేలు ఉంటుందని, మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

షాపుల్లో ముస్కాన్-ఎక్స్ టీం తనిఖీలు

డిండి : మండల కేంద్రంలో ఆపరేషన్ ముస్కాన్ ఎక్స్ టీం సభ్యులు శుక్రవారం పలు షాపుల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. డిండి పట్టణంలోని ఓ మెకానిక్ షాపులో మైనర్ బాలుడితో పనులు చేయిస్తున్న ముస్కాన్ టీం సభ్యులు దాడి చేసి పట్టుకున్నారు. మెకానిక్ షాపు నిర్వహిస్తున్న కె. మల్లేష్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.రాజు తెలిపారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పజెప్పారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగమణి

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన కందిమళ్ల నాగమణిరెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఆమెకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు.

రేషన్ దుకాణాల తనిఖీ


రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను శుక్రవారం పౌర సరఫరాల అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా రేషన్ దుకాణదారులు రేషన్ బియ్యం కొంటే వారి లైసెన్స్ రద్దు చేస్తామని, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఆయన వెంట పౌర సరఫరాల మేనేజర్ నాగేశ్వర్‌రావు ఉన్నారు.